


BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 | సంచిక -73 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 21-03-2026 | శనివారం | పేజీలు : 6

# అభివృద్ధి, సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం

## రూ. 3.24 లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్ 2026-27

- ఆరు గ్యారెంటీలకు పెద్దపీట.. ఇందిరమ్మ, బీమా, విద్యార్థులకు
- బ్రేక్‌ఫాస్ట్ వంటి సరికొత్త పథకాల ప్రకటన

హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో రూ. 3,24,234 కోట్ల భారీ అంచనాతో 2026-27 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. "ప్రజా పాలన - ప్రగతి వైపు" అనే నినాదంతో సాగిన ఈ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే, ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది.

బడ్జెట్ ముఖ్యాంశాలు:

మొత్తం వ్యయం: రూ. 3,24,234 కోట్లు

రెవెన్యూ వ్యయం: రూ. 2,34,406 కోట్లు

మూలధన వ్యయం : రూ. 47,267 కోట్లు

ఆరు గ్యారెంటీలకు కేటాయింపు: రూ. 50,713 కోట్లు

ప్రధాన కేటాయింపులు (శాఖల వారీగా చూస్తే పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి కి రూ. 33,688 కోట్లు, విద్యా రంగం కు రూ. 26,674 కోట్లు, వ్యవసాయానికి రు. 23,179కోట్లు, సాగునీటి రంగంకు రూ. 22,615 కోట్లు, విద్యుత్ శాఖ కు రూ. 21,285 కోట్లు, మున్సిపల్ పరిపాలన కు రూ. 17,907 కోట్లు, వైద్యం & ఆరోగ్యం శాఖ కు రూ. 13,679 కోట్లు కేటాయించారు.

మిగతా 2లో ..






# గోదావరి ఏజెన్సీలో 'పులి' పంజా..

- వణుకుతున్న మన్యం!
- తాజాగా ఆనవాళ్లు గుర్తింపు..
- గిరిజన గ్రామాల్లో కర్ఫ్యూ వాతావరణం
- అటవీ శాఖ హై అలర్ట్



రాజమహేంద్రవరం, మార్చి 20 (బిఎన్ఎస్): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పులి సంచారం ఇప్పుడు ఏజెన్సీ ప్రాంతానికి పాకింది. మైదాన ప్రాంతాల నుంచి అటవీ అంచులకు చేరుకున్న పులి, తాజాగా ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో తన ఆనవాళ్లను వదిలి వెళ్లడం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. పులి సంచరిస్తున్నట్లు పాదముద్రలు స్పష్టంగా కనిపించడంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి హై అలర్ట్ ప్రకటించారు.

# బడ్జెట్ అంకెల గారడీ.. అంతా మాయాజాలం..!!




హైదరాబాద్, మార్చి 20 (బిఎన్ఎస్): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. బడ్జెట్ ప్రసంగం కొనసాగుతున్నంత సేపు సభలో నిరసనలు తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు.. అనంతరం అసెంబ్లీ బయట మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, అంకెల గారడీతో తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తున్నారని విమర్శించారు.

అసెంబ్లీలో నిరసన జ్వాలలు

ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ చదువుతుండగా, ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి మరియు పెండింగ్ హామీల గురించి నిలదీశారు. సభలో మైకులు కట్ చేస్తున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొద్దిసేపు వాకౌట్ చేసి, అసెంబ్లీ ఆవరణలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

# గ్రూప్- 1కు ఎంపికైన వారికి హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం

హైదరాబాద్, మార్చి 20 (బీఎన్ఎస్) : -ఎంతో కష్టపడి చదువుకుని గ్రూప్ - 1 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పలు శాఖల్లో అధికారులుగా మీరు విధులు నిర్వహించనున్నారు. మీనే మీ విభాగాల్లో ప్రత్యేకతను చాటాలి. అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మీ చర్యలుండాలి. మీ ప్రతి చర్య పారదర్శకంగా ఉండాలి.. ప్రజాప్రయోజనమే లక్ష్యంగా ఉండాలి. ప్రజలకు పూర్తి అవగాహన ఉంటే.. పరిపాలన సులభమౌతుంది.

2 లో



# కొత్త విప్ లకు బాధ్యతలు

హైదరాబాద్ (బిఎన్ఎస్) శాసనమండలి, శాసనసభలో కొత్తగా నియమితులైన ప్రభుత్వ విప్‌లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ విప్‌లుగా నియమితులైన ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్ , బల్మూరు వెంకట్ నర్సింగరావు , ఎమ్మెల్యేలు వేముల వీరేశం , యెన్నం శ్రీనివాస్ రెడ్డి , విజయ రమణారావు మర్యాద పూర్వకంగా కలవగా, ముఖ్యమంత్రి వారికి అభినందనలు తెలిపారు.

# ఛలో జువ్వలదిన్నెలో ఉద్రిక్తత



నెల్లూరు, మార్చి 20 (బిఎన్ఎస్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సందర్శన సందర్భంగా శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'ఛలో జువ్వలదిన్నె' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సహా పలువురు కీలక నేతలను పోలీసులు అడ్డగించారు. జువ్వలదిన్నె పర్యటనకు వెళ్తున్న కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు.

పోలీసుల దిగ్బంధం - నేతల నిరసన

జువ్వలదిన్నె హార్బర్ పనులు పూర్తికావచ్చినా, ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని, మత్స్యకారుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ఆరోపిస్తూ వైకాపా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే, శాంతిభద్రతల దృష్ట్యా ఈ పర్యటనకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నెల్లూరు నగరంతో పాటు వెంకటాచలం, పొదలకూరు పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీస్ బలగాలను మోహరించి, వైకాపా నేతల నివాసాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

# గల్ఫ్ మంటలు

## ఇంధన వనరులే లక్ష్యంగా దాడులు..

- ప్రపంచానికి చమురు సెగ!
- కువైట్ రిఫైనరీపై డ్రోన్ దాడి.. ఇరాన్ ఐఆర్‌జీసీ ప్రతినిధి మృతి
- ఉగ్రరూపం దాల్చుతున్న పశ్చిమ ఆసియా యుద్ధం



# బడ్జెట్ అంకెల గారడీ.. అంతా మాయాజాలం..!!

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ విమర్శలు: "ఇది గాలిలో మేడలు కట్టే బడ్జెట్" మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు బడ్జెట్‌ను తీవ్రంగా తప్పుబట్టారు.

"కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమే. రైతులకు రుణమాఫీ పూర్తిగా చేయకుండా, రైతు భరోసా నిధులపై స్పష్టత ఇవ్వకుండా అన్నదాతను వెన్నుపోటు పొడిచారు. గత బడ్జెట్‌లో చెప్పిన కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు చేయని ప్రభుత్వం, ఇప్పుడు భారీ అంచనాలతో మభ్యపెడుతోంది. ఇది 'జీరో గెయిన్' బడ్జెట్," అని ఆయన వ్యాఖ్యానించారు.

బీజేపీ విమర్శలు: "ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కారు"
బీజేపీ నాయకులు స్పందిస్తూ.. ఈ బడ్జెట్‌లో వాస్తవాలు తక్కువ, ప్రగల్భాలు ఎక్కువ అని విమర్శించారు.

అప్పుల కుప్ప: గత బడ్జెట్ కంటే అప్పుల భారాన్ని పెంచి, రాబోయే తరంపై పెను భారం వేస్తున్నారని ఆరోపించారు.

మహిళా వంచన: మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పి, బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తకపోవడం మహిళలను వంచించడమేనన్నారు.

కేంద్ర గ్రాంట్లు: కేంద్రం ఇచ్చే నిధులను కూడా తమ ఖాతాలో వేసుకుంటూ, రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని బీజేపీ నేతలు మండిపడ్డారు.

ప్రతిపక్షాల ప్రధాన డిమాండ్లు:
రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15,000 ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలి.

నిరుద్యోగ భృతికి నిధులు ఎందుకు కేటాయించలేదో సమాధానం చెప్పాలి.

ప్రభుత్వ ఆదాయంపై పెట్టిన అంచనాలు అశాస్త్రీయంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు.

మొత్తానికి, ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను 'ప్రజల బడ్జెట్' అని అభివర్ణిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం ఇది 'విఫల బడ్జెట్' అంటూ విమర్శల పరంపరను కొనసాగిస్తున్నాయి. దీనిపై రేపటి నుండి అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ జరిగే అవకాశం ఉంది.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



మొదటి పేజీ తరువాయి

సరికొత్త పథకాలు:
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా: ప్రతి పేద కుటుంబానికి రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తూ కొత్త పథకాన్ని ప్రకటించారు. ఇది సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తుంది.

విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించారు.
హైదరాబాద్ అభివృద్ధి: గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేస్తూ పాలకులకు సౌలభ్యంగా ఉండేలా విభజన, 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణం, మూసీ పునరుద్ధరణ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు నిధులు కేటాయించారు.
యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ: నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ స్థాపన, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఆరు గ్యారెంటీల పద్దు:
రైతు భరోసాకు రూ. 18,000 కోట్లు, చేయూత (పెన్షన్లు) కోసం రూ. 14,861 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ. 5,500 కోట్లు, మహాలక్ష్మి పథకానికి రూ. 4,305 కోట్లు కేటాయించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది.

ముగింపు: ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ రూపొందించిన ఈ బడ్జెట్.. అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని సమతూకం చేస్తోందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

# గోదావరి ఏజెన్సీలో 'పులి' పంజా.. వణుకుతున్న మన్యం!

మొదటి పేజీ తరువాయి

ఏజెన్సీలో అలజడి: అర్ధరాత్రి వేట
గత వారం రోజులుగా ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో సంచరించిన పులి, ఇప్పుడు రౌతులపూడి మీదుగా ఏజెన్సీ ముఖద్వారంలోకి ప్రవేశించినట్లు అధికారులు భావిస్తున్నారు. తాజాగా గిరిజన గ్రామాల శివారుల్లో పశువుల మందలపై దాడి చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం అందుతోంది. తెల్లవారుజామున పొలాలకు వెళ్లే కూలీలు, అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లే గిరిజనులు పులి అడుగుజాడలను చూసి భయంతో వెనక్కి పరుగులు తీస్తున్నారు.

సీసీ కెమెరాల నిఘా.. బోన్ల ఏర్పాటు
పులి కదలికలను కనిపెట్టేందుకు అటవీ శాఖ అధికారులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

ట్రాప్ కెమెరాలు: పులి సంచరిస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో సుమారు 40కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బృందాలు: వైల్డ్ లైఫ్ నిపుణులు, షూటర్లతో కూడిన ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

బోన్లు: పులిని బంధించేందుకు అనువైన ప్రాంతాల్లో ఎర వేసి బోన్లను సిద్ధం చేశారు.
ప్రజలకు హెచ్చరికలు: గంట కొట్టి అప్రమత్తం
పులి సంచారం నేపథ్యంలో ఏజెన్సీలోని గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు డప్పు చాటింపు వేయించారు. "సాయంత్రం 6 గంటల తర్వాత ఎవరూ ఒంటరిగా బయటకు రావొద్దు.. పశువుల పాకల వద్ద కాపలా ఉండే వారు జాగ్రత్తగా ఉండాలి" అని హెచ్చరించారు. గిరిజన గ్రామాల్లో రాత్రి వేళల్లో మంటలు వేసుకుని నిఘా ఉంచాలని సూచించారు. కొన్ని చోట్ల ప్రజలు భయం భయంగా గడుపుతూ, ఇళ్లకే పరిమితం కావడంతో ఊర్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

అటవీ అధికారుల విశ్లేషణ
పులి తన నివాస ప్రాంతం కోసం వెతుకులాటలో భాగంగానే ఇన్ని రోజులు ఒకే చోట ఉండకుండా తిరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఏజెన్సీలో దట్టమైన అడవి ఉండటంతో దాన్ని పట్టుకోవడం సవాలుగా మారింది. "పులి ఆరోగ్యంగానే ఉన్నట్లు పాదముద్రల ద్వారా తెలుస్తోంది. ప్రజలు భయపడాల్సిన పనిలేదు, కానీ అప్రమత్తత చాలా అవసరం" అని జిల్లా అటవీ అధికారి తెలిపారు.
మరోవైపు పులి భయంతో పండించిన పంటలు కోయలేక, వ్యవసాయ పనులకు వెళ్లలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పులిని బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

# గల్ఫ్ మంటలు: ఇంధన వనరులే లక్ష్యంగా దాడులు..

దుబాయ్/టెహ్రాన్, మార్చి 20 (శుక్రవారం): పశ్చిమ ఆసియాలో యుద్ధం భీకర రూపం దాల్చుతోంది. గత 20 రోజులుగా ఇజ్రాయెల్-అమెరికా కూటమి మరియు ఇరాన్ మధ్య సాగుతున్న పోరు ఇప్పుడు గల్ఫ్ దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తోంది. శుక్రవారం ఉదయం కువైట్ లోని ప్రధాన చమురు శుద్ధి కర్మాగారం (రిఫైనరీ)పై డ్రోన్ దాడి జరగడం, ఇటు ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికార ప్రతినిధి అలీ మహమ్మద్ నైనీ మరణించడంతో పరిస్థితి మరింత విషమించింది.

నేటి ప్రధాన పరిణామాలు:
కువైట్ రిఫైనరీపై దాడి: కువైట్ లోని 'మినా అల్-అహ్మదీ' చమురు శుద్ధి కర్మాగారంపై శుక్రవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడి జరిగింది. ఈ దాడిలో రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగగా, ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు కువైట్ అధికారులు ప్రకటించారు.

ఇరాన్ కీలక నేత మృతి: టెహ్రాన్ సమీపంలో ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడుల్లో ×=+జ ప్రతినిధి అలీ మహమ్మద్ నైనీ చనిపోయినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ ధృవీకరించింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది.

ఖతార్ గ్యాస్ సంక్షోభం: ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్ఎన్జీ కేంద్రమైన ఖతార్‌లోని 'రాస్ లఫ్ఫాన్'పై ఇరాన్ జరిపిన దాడుల కారణంగా ఉత్పత్తి 17 శాతం పడిపోయింది. ఈ ప్రభావం భారత్, చైనా వంటి దేశాలకు గ్యాస్ సరఫరాపై పడనుంది.

హోర్ముజ్ జలసంధి దిగ్బంధం: వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై ఇరాన్ పన్నులు విధిస్తామని ప్రకటించడంతో అంతర్జాతీయ వాణిజ్యానికి పెను ముప్పు పొంచి ఉంది.

మొరాయించిన ఇంధన మార్కెట్లు
యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ కు 115 డాలర్ల పైకి చేరాయి. ఒకవేళ ఇరాన్ గల్ఫ్ లోని మరిన్ని చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే, పెట్రోల్ ధరలు ఊహించని స్థాయికి పెరుగుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ట్రంప్ - నెతన్యాహు మధ్య భేదాభిప్రాయాలు?
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ఇంధన వనరులపై దాడులు ఆపాలని కోరగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాత్రం ఇరాన్ అణు, సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేయడం కూటమిలో ఉత్కంఠను రేపుతోంది.

ఐక్యరాజ్యసమితి ఆందోళన
గల్ఫ్ యుద్ధం వల్ల ఇప్పటివరకు ఇరాన్, లెబనాన్ లలో వేల సంఖ్యలో పౌరులు మరణించారని, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి ఆవేదన వ్యక్తం చేసింది. రష్యా, చైనా, తుర్కియే దేశాలు తక్షణమే కాల్పుల విరమణ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి.
విశ్లేషణ: ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే 'గ్లోబల్ ఎనర్జీ వార్'గా మారుతోంది. ఈ సంక్షోభం ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందోనన్న ఆందోళనలో ప్రపంచ దేశాలు ఉన్నాయి.

# ఛలో జువ్వలదిన్నెలో ఉద్రిక్తత



మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వంపై కాకాణి నిప్పులు
తమను అడ్డుకోవడంపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..
"వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో 95 శాతం పనులు పూర్తయిన జువ్వలదిన్నె హార్బర్‌ను ప్రారంభించడంలో ఈ ప్రభుత్వానికి వచ్చిన అభ్యంతరం ఏమిటి? మేం అభివృద్ధిని చూడటానికి వెళ్తుంటే పోలీసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కూటమి ప్రభుత్వం కేవలం కక్షసాధింపు రాజకీయాలకే పరిమితమైంది. మత్స్యకారుల పొట్ట కొట్టేలా వ్యవహరిస్తోంది."
మరో నేత ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, పోలీసులు అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలపై గళమెత్తే హక్కు ప్రతిపక్షానికి లేదా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో అభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు.
తీర ప్రాంతంలో హై అలర్ట్
జువ్వలదిన్నె పరిసర ప్రాంతాల్లో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. హార్బర్ వైపు వెళ్లే రహదారులన్నింటినీ మూసివేశారు. పోలీసుల ఆంక్షలను ధిక్కరించి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన వైకాపా శ్రేణులకు, పోలీసులకు మధ్య నెల్లూరు-కోడూరు రహదారిపై తీవ్ర తోపులాట జరిగింది. పలువురు కార్యకర్తలను పోలీసులు బలవంతంగా వాహనాల్లో ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించారు.
ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా జువ్వలదిన్నె మత్స్యకారుల పక్షాన పోరాటం ఆపేది లేదని వైసీపీ నేతలు స్పష్టం చేశారు. ఈ ఉదంతంతో జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది.

# గ్రూప్- 1కు ఎంపికైన వారికి హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం



హైదరాబాద్, మార్చి 20 (బీఎన్ఎస్) : -ఎంతో కష్టపడి చదువుకుని గ్రూప్ - 1 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పలు శాఖల్లో అధికారులుగా మీరు విధులు నిర్వహించనున్నారు. మీనే మీ విభాగాల్లో ప్రత్యేకతను చాటాలి. అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మీ చర్యలుండాలి. మీ ప్రతి చర్య పారదర్శకంగా ఉండాలి.. ప్రజాప్రయోజనమే లక్ష్యంగా ఉండాలి. ప్రజలకు పూర్తి అవగాహన ఉంటే.. పరిపాలన సులభమౌతుంది. వారి మద్ధతు కూడా సంపూర్ణంగా అందుతుంది. చరిత్రను ఫాలో అయి.. మీ విభాగాల్లో ఎవరికి వారు కొత్త చరిత్రను సృష్టించాలి - అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. గ్రూప్ -1 కేడర్‌కు ఎంపికైన ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంల భాగంగా శుక్రవారం డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. హైడ్రా కార్యకలాపాలను వివరించారు. ఆదిలో హైడ్రా ఎదుర్కొన్న సవాళ్లను.. వాటిని అధిగమించిన తీరును తెలిపారు. హైడ్రా అంటే ప్రజల్లో పూర్తిగా అవగాహన రావడంతో తాము చేపట్టే కార్యక్రమాలకు పూర్తి స్థాయి మద్ధతు లభిస్తోందన్నారు. సామాజిక మాధ్యమాల్లో గమనిస్తే.. హైడ్రా అంటే ఆదిలో దాదాపు 70 శాతం నెగిటివిటీ కనిపించేది.. ఇప్పుడా శాతం రివర్స్ అయ్యిందన్నారు. 85 శాతం మంది హైడ్రా పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ఇదంతా ప్రజలకు అర్థమయ్యేలా మన కార్యకలాపాలు సాగించడం.. గ్రౌండ్‌మీద ఫలితాలు చూపించడంతో సాధ్యమైందన్నారు.

రాతలు కాదు.. చేతలు కనిపించాలి..!!
సమాజ ప్రయోజనాలు కోరి మంచి చట్టాలు రూపొందించుకున్నాం. పేపరు మీద అన్నీ ఉంటాయి.. కాని వాటిని అమలు చేయకపోతే ప్రయోజనం లేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. తమ్మిడికుట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత కాని.. ప్యాట్నీ నాలా ఆక్రమణలు తొలగించడంలో కాని.. ఇలా అనేక విషయాల్లో స్పష్టంగా ఉల్లంఘనలున్నా.. వాటిపై చర్యలుండేవి కాదు. హైడ్రా ఆ ఒరవడిని మార్చింది. నగరంలో ఇప్పటికే 3 చెరువులను పునరుద్ధరించగా.. మరో 22 చెరువులను అందుబాటులోకి తెచ్చుందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగించినప్పుడు విమర్శించిన వారే ఇప్పుడు అభినందిస్తున్నారు. కాలువల్లో పూడికను పెద్దమొత్తంలో తొలగించడం ద్వారా గత వర్షాకాలంలో వరద ముప్పుతో పాటు.. నీటి మునక సమస్య నగరంలో తలెత్తకుండా చూశామన్నారు. చెరువుల పునరుద్ధరణ, కాలువల పరిరక్షణ ఆవశ్యకతను ఈ సందర్భంగా వివరించారు. గ్రూప్ -1 అధికారులుగా ఎంపికైన వారి సందేహాలను కూడా ఈ సందర్భంగా నివృత్తి చేశారు. తాను నిర్వహించిన అన్ని విధులూ సంతృప్తినిచ్చాయని.. ఎక్కడ ఉన్నా.. ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని మనసారా స్వీకరించి నిబద్ధతతో పని చేయడమే తన విధానమని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రజలతో మమేకమై.. వారి సాదక బాధకాలు తెలుసుకోడానికి ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వారి సమస్యలను పరిష్కరించుకుంటూ పోతే.. మన విధులు తేలికౌతాయని సూచించారు. హైడ్రా కార్యకలాపాలను దగ్గరగా పరిశీలిస్తున్నామని.. హైడ్రా పనితీరు మాకందరికీ మార్గదర్శకమౌతుందని కొత్తగా ఎంపికైన ఉద్యోగులు ఈ సందర్భంగా తెలిపారు.

# జన గణన చాలా కీలకం




నల్గొండ (బిఎన్ఎస్): జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు కీలకమని సూర్యాపేట జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.
జిల్లాలో జనాభా గణన-2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లార్క్ లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు ఇళ్ల జాబితా, గృహ గణన (నూూ) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో 2026 మే11 నుంచి జూన్ 9, 2026 వరకు గృహగణన ఉంటుందని, రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా గణన నిర్వహిస్తారనీ అన్నారు.. జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగిస్తున్నందున జన గణన నిర్వహణకు అవసరమైన అన్ని విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

# మెసారా ఇన్‌ఫ్రాతోనే కొల్లూరు ప్లాట్ యజమానుల అడుగులు

## ఐక్యత -- నమ్మకం -- హక్కుల సాధనకు కొత్త మార్గం



కొల్లూరు భూముల అంశంలో ఇప్పుడు ఒక స్పష్టమైన దిశ కనిపిస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా వివాదాలతో సాగిన ఈ వ్యవహారంలో, ప్లాట్ యజమానులు ఇక సందిగ్ధతకు తావులేకుండా ఒకే నిర్ణయానికి వచ్చారు -- మెసారా ఇన్‌ఫ్రాతోనే ముందుకు సాగాలి. ఈ భావన ఇప్పుడు యజమానులలో బలంగా ప్రతిధ్వనిస్తోంది. వ్యక్తిగత పోరాటాల నుంచి బయటపడి, ఒక సమిష్టి శక్తిగా మారిన ప్లాట్ యజమానులు మెసారా ఇన్‌ఫ్రా నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో నడుస్తున్నారు.

చట్టబద్ధ యాజమాన్యంపై ధృఢ విశ్వాసం

కొల్లూరు ప్రాంతంలోని భూములు 1984లో చట్టబద్ధంగా ప్లాట్లుగా విభజించబడ్డాయి. ఆ తరువాత జరిగిన అన్ని లావాదేవీలు రిజిస్ట్రేషన్ ప్రక్రియల ద్వారా సాగాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్లాట్లు కలిగిన యజమానులకే పూర్తి హక్కులు ఉన్నాయని వారు నొక్కి చెబుతున్నారు.

"మేము చట్టబద్ధంగా కొనుగోలు చేసిన యజమానులమే" అనే భావన ఇప్పుడు వారిలో మరింత బలపడింది.

అవుటర్ రింగ్ రోడ్ తర్వాత మారిన దృశ్యం

2002లో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన వచ్చిన తరువాత కొల్లూరు ప్రాంతం ప్రాధాన్యం పెరిగింది. ఈ పరిణామం రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను వేగవంతం చేసింది.

ఈ సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు వివాదాలకు దారి తీసినప్పటికీ, ఇప్పుడు యజమానులు ఒకే వేదికపైకి రావడం ద్వారా సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు.

మెసారా ఇన్‌ఫ్రాపై నమ్మకం -- నిర్ణయాత్మక మలుపు

కొల్లూరు ప్లాట్ యజమానుల ఉద్యమంలో అత్యంత కీలకమైన అంశం -- మెసారా ఇన్‌ఫ్రాపై ఉన్న విశ్వాసం.

సంస్థ అధినేత మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి నాయకత్వంపై యజమానులు పూర్తి నమ్మకం ఉంచుతున్నారు. చట్టబద్ధ మార్గాల్లో సమస్యను పరిష్కరించగల సామర్థ్యం ఆయనకు ఉందని వారు విశ్వసిస్తున్నారు.

ఇకపై తమ పోరాటం మెసారా ఇన్‌ఫ్రాతో కలిసి కొనసాగుతుందని, అదే తమకు విజయాన్ని అందిస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

ఐక్యతతో ముందుకు -- సమిష్టి శక్తి

గతంలో విడివిడిగా ఉన్న ప్లాట్ యజమానులు ఇప్పుడు ఒక సమాఖ్యగా మారారు.

వారి మాటల్లో స్పష్టత ఉంది --

"మెసారా ఇన్‌ఫ్రాతో కలిసి నడిస్తేనే మన హక్కులు సాధ్యమవుతాయి".

ఈ ఐక్యతే ఇప్పుడు వారి బలం.

విజయపథం వైపు కొల్లూరు ఉద్యమం

ప్రస్తుతం కొల్లూరు ప్లాట్ యజమానుల పోరాటం ఒక కొత్త దశలోకి ప్రవేశించింది.

చట్టబద్ధ హక్కులపై స్పష్టత

సమిష్టి ఐక్యత

మెసారా ఇన్‌ఫ్రా నాయకత్వంపై గట్టి నమ్మకం

ఈ మూడు అంశాలు కలిసి ఉద్యమాన్ని విజయపథం వైపు నడిపిస్తున్నాయి.

మొత్తం మీద, కొల్లూరు ప్లాట్ యజమానులు ఇప్పుడు ఒకే సందేశాన్ని ఇస్తున్నారు -- "మెసారా ఇన్‌ఫ్రాతోనే మా ప్రయాణం... అదే మా విజయపథం".

---

### కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక మహోత్సవాలకు శ్రీకారం...



వాడపల్లి.. (బిఎన్ఎస్ )మార్చి 20 : ఈ నెల 28 నుండి ప్రారంభమయ్యే శ్రీ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ రోజు ఆలయంలో పందిరి రాట ముహూర్తం శుభకార్యంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) గారు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు గారు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

---

### వాడపల్లి వెంకటేశ్వర స్వామికి స్వర్ణ శరగోపాన్ని చేయించిన భక్తులు...

**□ఎమ్మెల్యే సత్యానందరావు సంక్షమంలో స్వామి వారి ఆలయానికి రాఘవరాజు, సూర్యనారాయణరాజు...**



వాడపల్లి (బిఎన్ఎస్ ) మార్చి 20..కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈరోజు శ్రీ స్వామి వారికి భీమవరం వాస్తవ్యులు 108 గ్రాములు సుమారు 17 లక్షల విలువగల స్వర్ణ శరగోపం వుద్ధరాజు సత్యవతమ్మ పేరున వారి కుమారులు రాఘవరాజు, సూర్యనారాయణ రాజు లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సంక్షమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటారాజు (గబ్బర్ సింగ్), ఆలయ ధర్మకర్తలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

---

### నరసింహ స్వామికి బంగారు మరియు వెండి కానుక



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): –ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంకి హైదరాబాద్ వ్ వాస్తవ్యులు శ్రీ వసంతపు శ్రీనివాస్ శ్రీమతి మాధవిలు పదకొండు లక్షల రూపాయల విలువగల వజ్రములతో కూడిన బంగారు మంగళ సూత్రం మరియు వెండి కాలి పట్టీలు, వెండి మెట్లు రూపంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేతికి అందజేశారు. అనంతరం వారికి కార్యనిర్వహణాధికారి ఆలయ మర్యాదలతో శ్రీవార్ల దర్శనం స్వామివార్ల శేష వస్త్రములు మరియు ప్రసాదం అందజేశారు.

---

## సైబరాబాద్‌లో మహిళల భద్రతపై కఠిన చర్యలు



సైబరాబాద్, మార్చి 20: (బిఎన్ఎస్ మీడియా): మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సైబరాబాద్ షీ టీమ్స్ వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో 113 డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, పబ్లిక్ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తున్న 41 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. వీరిలో 59 కేసుల్లో పెట్టి కేసులు నమోదు చేయగా, మిగతా వారిని కౌన్సెలింగ్ ద్వారా హెచ్చరించారు.

ఇదే సమయంలో మహిళల నుంచి మొత్తం 26 ఫిర్యాదులు వివిధ మార్గాల్లో షీ టీమ్స్‌కు అందినట్లు అధికారులు తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక దాడులు

సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) చేపట్టిన నైట్ రైడ్స్‌లో భాగంగా వారాంతంలో ఒక ట్రాన్స్‌జెండర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా (02) ఏహెచ్‌టీయూ కేసుల్లో 5 మంది బాధితులను రక్షించి, 5 మందిని అరెస్టు చేశారు. అలాగే (02) జీజీ యాక్ట్ కేసుల్లో 9 మంది బాలురను రక్షించి, 8 మందిని అదుపులోకి తీసుకున్నారు.

కుటుంబ కలహాల్లో పరిష్కారం

ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు/ జీఆర్‌సీ సెంటర్ల ద్వారా భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదాల్లో 20 కుటుంబాలను మళ్లీ కలిపేందుకు అధికారులు కృషి చేశారు.

విస్తృత అవగాహన కార్యక్రమాలు

మహిళల భద్రత, మానవ అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, స్టాకింగ్, సైబర్ నేరాలు వంటి అంశాలపై సైబరాబాద్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సుమారు 2992 మంది పాల్గొని పలు ముఖ్య అంశాలపై అవగాహన పొందారు. మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, సైబర్ క్రైమ్ 1930 వంటి సేవల ప్రాముఖ్యతను వివరించారు.

సనత్‌నగర్‌లో మహిళల భద్రతపై ప్రత్యేక కార్యక్రమం

సనత్‌నగర్‌లోని ఎలికో హెల్త్ కేర్ సర్వీసెస్‌లో మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించగా, 100 మందికి పైగా పాల్గొన్నారు. షీ టీమ్స్ పని విధానం, భద్రతా చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై వివరించారు.

అలాగే బాధితులకు తక్షణ సహాయం అందించే భరోసా సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. డిజిటల్ భద్రత, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ సురక్షిత వినియోగంపై కూడా ప్రత్యేకంగా చర్చించారు.

---

## మోసం... దగా...!!

హైదరాబాద్ (బీఎన్ఎస్): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు.



మోసం... దగా...ప్రజా వంచన బడ్జెట్ ఇది. అంకెల ఆర్భాటాలు... కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగేందేమీ లేదు. ఆదాయాన్ని పండబెట్టి...అప్పుల కోసం అర్రుల చాచే బడ్జెట్ ఇది. మరో రూ.లక్ష కోట్లు అదనంగా అప్పు భారం మోపేందుకు సిద్ధమవ్వడం సిగ్గు చేటు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో హ్యాట్రిక్ ('మూడో బడ్జెట్ ఇది) కొట్టిన కాంగ్రెస్. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. రైతు భరోసా పైసలు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా? . రూపాయ బిళ్ల కూడా ఇవ్వకుండా కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారు. మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్... రూ.2500లు నిల్. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారు...రూ.4 వేల పెన్షన్ పెంపు ఊసే లేదు. నిరుద్యోగులున్నారనే సోయే లేదు.... బడ్జెట్ లో నిరుద్యోగ భృతి అంశమే లేదు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు కదా.... రూపాయి బిళ్ల కేటాయించలే. 6 గ్యారంటీలకు పాడె కట్టే బడ్జెట్ ఇది. ఆరోగ్యశ్రీకి బడ్జెట్ కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువ. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదిస్తే...8 శాతానికే పరిమితం. దేవాదాయ శాఖకు గత బడ్జెట్ లో రూ.190 కోట్లు కేటాయిస్తే... ఈసారి కేటాయింపుల ప్రస్తావనే లేదు అని వివరించారు.

12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు... 56 శాతం బీసీ జనాభాకు 4 శాతం కేటాయింపులా?... ?ఎస్సీ, ఎస్టీలకు సైతం బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేశారు. మైనారిటీలకు గతేడాదికంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరం. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ముందా.. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా?...అని ఇష్టారాజ్యంగా అప్పులు చేసేందుకు సిద్ధమయ్యారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ తోపాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై విచారణ చేపడతాం అని మండిపడ్డారు.

# ఉగాది సెలవుల్లో విషాదం: గోదావరిలో ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతు



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20(బిఎన్ఎస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం....ఉగాది సెలవులకు వచ్చి గోదావరి లో గల్లంతు అయిన బి టెక్ విద్యార్థులు.అమరావతి లో srmt కాలేజీలో బి టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు భద్రాచలం కి చెందిన మిత్రులు అభిరామ్ శ్రీకర్ లతో కలిసి ఈరోజు ఉదయం ఆంధ్రా ఎటపాక మండలం లోని పురుషోత్తమ పట్నం గ్రామ శివారులోని కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలో ఉన్నా గోదావరి నది లో స్నానాలకు దిగారు.ఫోటోలు తీసుకుంటూ గోదావరిలో 7 గురు యువకులు గల్లంతు కాగా వీరిలో ఇద్దరు ఈత రావడంతో ఒడ్డుకి చేరుకున్నారు.వీరిలో 5 గురు గోదావరి లో గల్లంతు అయ్యారు.వారి కోసం భద్రాచలం ఎటాపాక పోలీసులు గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు.మృతదేహాల కోసం రిస్క్ టీమ్ వారు గాలిస్తున్నారు.

గల్లంతు అయిన వారు..సతీష్,మదనపల్లి,నవదీప్ ఉయ్యూరు, తేజజ్ఞ ఉయ్యూరు అభిరామ్ విజయనగరం. శ్రీకర్ భద్రాచలం.

# ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి...



నెల్లిమర్ల లో ఉన్న ఈవిఎం గోదాములను జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మూడు నెలలకు ఒకసారి గోదాముల లోపల తనిఖీ లో భాగంగా గోదాము షట్టర్లకు అమర్చిన సీల్స్, తాళాలను తెరిపించి లోపలి గదులను, ఈవీఎం యంత్రాల నిల్వను సమగ్రంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

గోదాం పరిసర ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి, అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు, పోలీసు సిబ్బందికి సూచించారు. భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేసారు.

# ఆ విలేజ్ లో అంతా సూపర్..!!



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా:- రెబ్బెన మండలం ఖైరిగూడ గ్రామంలో పెళ్ళిళ్ళకు డీజే లు పెట్టమని,హల్దీ ఫంక్షన్,ప్రీ వెడ్డింగ్ షూట్ లను నిషేధిస్తున్నామని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు...

నిబంధనలు అతిక్రమించి ఎవరైనా గ్రామంలో డీజే పెట్టిన,హల్దీ ఫంక్షన్,ప్రీ వెడ్డింగ్ షూట్ చేసిన వారికి 50,000/- రూపాయలు జరిమానా విధిస్తామని గ్రామస్థులు తీర్మానం చేశారు..

అంతే కాకుండా గ్రామ సభ అనంతరం గ్రామంలో మద్యపానం,గుడుంబా, మత్తు పదార్థాలను కూడా పూర్తిగా నిషేధిస్తామని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు...

# స్టూడెంట్ హల్ చల్




కామారెడ్డి (బిఎన్ఎస్): జుక్కల్ నియోజక వర్గం మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామంలో కుటుంబ విభేదాల కారణంగా ఓ విద్యార్థిని గ్రామంలోని నీటి ట్యాంక్ ఎక్కి హల్చల్ చేసిన ఘటన చోటు చేసుకుంది. గురువారం రాత్రి మెట్టు స్రవంతి (17) అనే ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థిని తన తల్లి చివాట్లుతట్టుకోలేకగ్రామంలోని 60 అడుగుల ఎత్తు గల త్రాగునీటి ట్యాంక్ పైకి ఎక్కి హల్చల్ చేసింది. ఈ విషయం గమనించినకొందరుస్థానికులు బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్. ఎ. కిరణ్మయి కి కాల్ చెయ్యడం తో విషయం అందుకున్న సబ్ కలెక్టర్ గ్రామానికి చేరుకొని తన ధైర్య సాహసాలతో స్వయంగా ట్యాంక్ పైకి ఎక్కి యువతిని ఓదారుస్తూ కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. విద్యార్థినితో చర్చలు జరిపి, పూర్తి నమ్మకం కల్పించి సురక్షితంగా ట్యాంక్ పైనుండి కిందికి దించేలా కీలక పాత్ర పోషించారు. ఎల్లారెడ్డి అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు, గ్రామ సర్పంచ్, స్థానిక పెద్దల సమన్వయంతో యువతిని ఎటువంటి ప్రమాదం లేకుండా కిందికి దించారు. ప్రస్తుతం యువతి సురక్షితంగా ఉంది. సబ్ కలెక్టర్ ఈ ఘటన లో చురుకుగా స్పందించి యువతిని రక్షించడం పట్ల గ్రామస్థులు అభినందించారు. సుమారు రెండు గంటల 30 నిమిషాల పాటు నీటి ట్యాంక్ పై ఉండి అందర్నీ భయాందోళనకు గురి చెయ్యడంతో వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ ఆ విద్యార్థిరాలిని సురక్షితంగా కాపాడి విద్యార్తిరలి తండ్రి నాయక్ పోడు సాయిలు, తల్లి లతో మాట్లాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి అభయం



తిరుపతి (బిఎన్ఎస్): శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనంపై స్వామివారు భక్తులను అభయమిచ్చారు.ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రకృతికి శోభను సమకూర్చేది చెట్టు. అందులో మేటి కల్పవృక్షం. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని స్వామివారు అధిరోహించారు.

అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.

# రైతుల ఆందోళన



ఖమ్మం జిల్లా: సత్తుపల్లి పట్టణంలో నకిలీ వరి విత్తనాలు విక్రయించారంటూ రైతులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని వెంకటరమణ ఫెర్టిలైజర్ షాప్ ముందు పెద్ద సంఖ్యలో చేరుకున్న రైతులు ధర్నా నిర్వహించారు. విత్తనాల పేరుతో తమను మోసం చేశారని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరి సాగు కోసం కొనుగోలు చేసిన విత్తనాలు నాణ్యతలేనివిగా, నకిలీవిగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.సుమారు 500 ఎకరాలకు నష్టం జెరిగిందని గతేదాడి ఎకరానికి 50 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని ఈ ఏడాది దీనివల్ల ఇప్పటికే ఎకరానికి 35 వేల వరకు తమకు ఆర్థిక నష్టం వాటిల్లిందని, పంటపైనా తీవ్ర ప్రభావం పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన దుకాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

అంతేకాకుండా, ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో పూర్తి స్థాయి విచారణ జరిపి, రైతులకు తగిన పరిహారం అందించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# వాడపల్లి వెంకన్నకు రూ.17లక్షల విలువైన 108 గ్రాముల బంగారు శఠగోపాన్ని కానుకగా ఇచ్చిన భక్తులు...

**ఎమ్మెల్యే బండారు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి కానుకను సమర్పించిన ఉద్దరాజు సోదరులు...**



వాడపల్లి(బిఎన్ఎస్ )మార్చి 20:కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఉద్ధరాజు రాఘవరాజు, సూర్యనారాయణరాజు సోదరులు తమ మాతృమూర్తి ఉద్ధరాజు సత్యవతమ్మ పేరు మీద రూ.17 లక్షల విలువైన 108 గ్రామాల బంగారు శఠగోపాన్ని కానుకగా స్వామివారికి సమర్పించారు. శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే బండారు సమక్షంలో ఈ కానుకను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజులకు ఉద్ధరాజు సోదరులు అందజేశారు. దాతలను ఎమ్మెల్యే బండారు అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు ఆలయంలో జరుగుతున్న ఉచిత క్యూలైన్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. వృద్ధులకు, చిన్నారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తునికి సంతృప్తికరంగా స్వామి దర్శనం జరిగేలా చూడాలన్నారు.

# నక్కపల్లి సిద్ధం.. 23న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన



అనకాపల్లి (బీఎన్ఎస్): అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతం ఈ నెల 23న జరగనున్న ఆర్సలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి సిద్ధమవుతోంది.రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ హాజరుకానుండటంతో అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు.కార్యక్రమం నేపథ్యంలో సభా ప్రాంగణం వద్ద పనులు జోరుగా కొనసాగుతున్నాయి.ముఖ్య అతిథులు విమానంలో విచ్చేయనున్న నేపథ్యంలో తాత్కాలిక హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టగా,భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.ట్రాఫిక్ అంతరాయం లేకుండా రహదారుల మరమ్మతులు, మార్గదర్శక సూచికలు ఏర్పాటు చేస్తున్నారు.బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున తాగునీరు,పారిశుద్ధ్యం,పార్కింగ్ వంటి సదుపాయాలను కల్పిస్తున్నారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు తుదిదశకు చేరుకుంటుండగా,కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని విధాలుగా సిద్ధమవుతున్నారు.

# విశాఖ అమెరికన్ హాస్పిటల్‌లో కోరాడ వెంకట్రావు కుమారుడిని పరామర్శించిన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను



ఆనందపురం జెడ్పిటిసి కోరాడ వెంకట్రావు కుమారుడు ఇటీవల ప్రమాదానికి గురై, ప్రస్తుతం మహారాణి పేటలోని అమెరికన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాస్పిటల్ కి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. బాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఉచిత HPV వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా?వెంకటగిరి(బి.యన్.యస్): -రాష్ట్రములో ఆడపిల్లల భవిష్యత్తును మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, వెంకటగిరి నియోజకవర్గంలో 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా 'హ్యూమన్ పాపిలోమావైరస్' వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు ఖర్చయ్యే ఈ ఖరీదైన వ్యాక్సిన్‌ను, పేద ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు.వెంకటగిరి నియోజకవర్గంలోని బాలయపల్లి, డక్కిలి, వేంకటగిరి రూరల్ మండలాలు మరియు వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో సుమారు 3,500 మంది 14 ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ అందించడమే లక్ష్యమన్నారు.

ప్రస్తుతం 200 వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే మిగతా వారికి కూడా విడతల వారీగా వ్యాక్సిన్ వేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు మాట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్‌ను 90-95% వరకు నివారిస్తుందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల భవిష్యత్తులో పిల్లలు పుట్టరనే అపోహల్లో ఎలాంటి నిజం లేదని, ఇది పూర్తిగా సురక్షితమని, శాస్త్రీయంగా నిరూపించబడినదని డాక్టర్లు స్పష్టం చేశారు. 14 ఏళ్లు నిండిన ఆడపిల్లల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా తమ పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇప్పించి, వారిని ప్రాణాంతక క్యాన్సర్ బారి నుండి రక్షించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఏఎంసీ చైర్మన్, ఏఎంసీ మాజీ చైర్మన్, పట్టణ అధ్యక్షులు, మాజీ పట్టణ అధ్యక్షులు, జనసేన అధ్యక్షులు, హాస్పిటల్ అభివృద్ధి సభ్యులు, నర్సింగ్ సిబ్బంది, మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు ఈద్ తోఫా పంపిణీ



రాయపర్తి, 20 మార్చి (బిఎన్ఎస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఈద్ తోఫా కిట్లను అందిస్తోంది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి అధికారులతో కలిసి మండల కేంద్రం లోని మస్జిద్ ఏ నూర్ లో తోఫా అందచేయడం జరిగింది.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పేద ముస్లింలు కూడా సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చొరవ తీసుకుందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల పట్ల ఉన్న ప్రేమకు, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపిడిఓ కిషన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పల్లె వినోద్, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, వార్డు సభ్యులు మహ్మద్. ఫిరోజ్, గారే కళ్యాణి విష్ణు, మస్జిద్ సదర్ సాబ్ మహ్మద్ హుస్సేన్, నయబ్ సదర్ ఇక్బాల్, కమిటీ సభ్యులు షకీల్, రఫీ, చోటు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుల్ కుమారుడిని అభినంధించిన పోలీస్ కమీషనర్




నిజామాబాద్ (బిఎన్ఎస్): సిసిఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి. రవి కృష్ణ కుమారుడు బి. రజనీకాంత్ బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ ( హోమియోపతి ) శిక్షణ పూర్తి చేసిన సందర్భముగా నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్., అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల పిల్లలు ఉన్నత చదువులు చదివి, సమాజానికి ఉపయోగపడే వృత్తుల్లో స్థిరపడటం గర్వకారణమని పోలీస్ కమీషనర్ పేర్కొన్నారు.

నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్‌లో సి. సి. ఎస్ లొ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవి కృష్ణ కుమారుడు రజనీకాంత్ , కష్టపడి చదివి హోమియోపతి డాక్టరుగా పట్టా పొందారు. కష్టపడి చదివి డాక్టరుగా ఎదిగిన రజనీకాంత్ ను ఆదర్శంగా తీసుకోవాలని , పోలీస్ సిబ్బంది పిల్లల చదువులకు తమ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

# అకాల వర్షాలకు పంట నష్టం



నిజామాబాద్ (బిఎన్ఎస్): నిజామాబాదు జిల్లా భీంగల్ మండలం బచన్పల్లి గ్రామం లో రాత్రి వేల కురిసిన వాడగాళ్ల వాన వల్ల నెల రాలిన వరి పంట అరుగలం పండించిన వరి పంట వాడగాళ్ళ వానకు నెల రాలింది అని రైతులు ఆందోళన చెందుతున్నారు. బచన్ పల్లి గ్రామం లో సుమారు 200ఎకరాల్లో వరి పంట నెల రాలింది అని ప్రభుత్వం అదుకోవాలని రైతులు విన్నపించారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో వేడుకలు.



రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఘనాపాటి నౌదూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం చేశారు. పంచాంగ శ్రవణం నిర్వహించిన విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ గారిని ఆలయ జుశీ వరప్రసాదరావు గారు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ గారు ఘనంగా సత్కరించారు.

# నీలమ్మ చెరువు కబ్జా తొలగించాలి



శ్రీకాకుళం: శ్రీకాకుళం పీఎన్ కాలనీకి ఆనుకుని ఉన్న నీలంచెరువు ఆక్రమణలు తొలగించాలని నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, దుప్పలవలస నీటి సంఘం అధ్యక్షుడు సనపల రామారావు డిమాండ్ చేశారు.

చౌదరి సత్యన్నారాయ కాలనీ సచివాలయం పరిధిలోని నీలంచెరువు ఆక్రమణకు గురి అవుతున్నట్టు ఇటీవల జయం సాయకాలం దినపత్రికలో ప్రచురితమైంది. అలాగే ప్రజా వినతులు, పరిష్కార వేదికలో పలువురు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులు కబ్జా పనులు నిలిపివేశారు. అదును చూసి తిరిగి కబ్జా స్థలాన్ని చదును చేసి సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, నీటి సంఘం అధ్యక్షుడు సనపల రామారావులు ఈ స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి కబ్జా స్థలాన్ని తిరిగి యథావిధిగా ఉండేలా చూస్తామన్నారు.

# విశ్వశాంతి కోసమే శ్రీమన్నారాయణ మహాయజ్ఞం

## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



విజయవాడ (బిఎన్ఎస్ ): దేశాల మధ్య ఐక్యత వెల్లివిరియాలని విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించ తలపెట్టిన శ్రీమన్నారాయణ మహాయజ్ఞం సఫలం కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోడూరు మండలం ఉల్లిపాలెంలోని శ్రీమన్నారాయణ స్వామి వారి దేవస్థానంలో ఏప్రిల్ 19-29 తేదీల్లో రాజగోపుర కుంభ ప్రోక్షణ శ్రీమన్నారాయణ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనేక దేశాల్లో యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో యజ్ఞ ప్రభావంతో ప్రపంచ దేశాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలనే ఉన్నత ఆశయంతో చేపట్టిన ఈ యజ్ఞాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాచీన దేవాలయాలకు నిలయమైన దివిసీమలో ఉల్లిపాలెం దేవాలయాన్ని ఆధునిక దేవాలయంగా అభివృద్ధి చేసిన అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి ప్రశంసనీయులన్నారు. వారు సన్యాస ఆశ్రమం చేపట్టి 25ఏళ్ళు పూర్తి కావస్తున్న సందర్భంగా చేపట్టిన ఈ మహా యజ్ఞ ఫలంతో విశ్వశాంతి స్థాపన జరగాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగే ఈ ఈ కార్యక్రమానికి త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామితో పాటు, ప్రతిరోజు అనేకమంది స్వామీజీలు విచ్చేయనున్నట్లు తెలిపారు.

త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ దేవస్థాన ప్రాంగణంలో తొలి రోజు ప్రారంభ కార్యక్రమం, నవాహ్నిక దీక్షతో తొమ్మిది రోజులపాటు 13యాగశాలలు, 108 హోమ గుండాలు, ఇష్టి హోమ గుండాలు, కోటి అష్టాక్షరి మంత్ర హవనంతో శ్రీమన్నారాయణ మహా యజ్ఞం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యజ్ఞఫలంతో విశ్వశాంతి స్థాపన జరగాలనే ఆకాంక్షతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

సమావేశంలో కర్నూలుకు చెందిన నాగరాజు గుప్తా, పాంచజన్య గీతా పారాయణ సంఘం సభ్యులు ఉల్లి గురురంగ ప్రసాద్ పాల్గొన్నారు.

# తిరుమలలోనే ప్రసాదాల కల్తీని గుర్తించే అత్యాధునిక స్టేట్ ఫుడ్ ల్యాబ్ సిద్ధం!



అమరావతి,మార్చి 20(బిఎన్ఎస్):కలియుగ వైకుంఠ వెంకటేశ్వరునికి స్వామివారిని దర్శించుకునే భక్తులకు పవిత్ర మైన, నాణ్యత కలిగిన ప్రసాదాలను అందించేందుకు ఆధునిక పరిజ్ఞానంలో ఫుడ్ సేఫ్టీ లాప్ ని తెచ్చారు. పుణ్యక్షేత్రమైన తిరుమలలో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రారంభించనున్నారు. శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాల్లో నాణ్యత, స్వచ్ఛత, నెయ్యి, నూనె, పాలు, ఇతర ముడిసరకుల్లో సూక్ష్మ స్థాయిలో కల్తీ జరిగినా పసిగట్టే పరీక్షలు ఈ అత్యాధునిక ల్యాబ్ లో జరుగుతాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. పుణ్య క్షేత్రాల్లో ఈ తరహా ఫుడ్ లేబరేటరీ ఏర్పాటు కావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. నూనె, పాలు, నెయ్యిలో ఫెస్టిసైడ్స్, ప్రిజర్వేటివ్స్ వంటి అవశేషాలను కూడా ఈ ల్యాబ్ లో గుర్తిస్తారని తెలిపారు. కెమికల్ ఎనాలిసిస్, మైక్రోబయాలజీ ఎనాలిసిస్ పరీక్షలకు అనుగుణంగా పరికరాలు/యంత్రాలను ల్యాబ్ లో సమకూర్చామని పేర్కొన్నారు.

మంత్రి సత్యకుమార్ చొరవతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి..!

మంత్రి సత్యకుమార్ సమక్షంలో అక్టోబర్ 8, 2024న ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ)తో న్యూఢిల్లీలో రాష్ట్ర అధికారులు చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించి తిరుమలలో 12వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా ఫుడ్ ల్యాబరేటరీ ఏర్పాటైంది. పలు పుణ్యక్షేత్రాల్లో ల్యాబ్స్ ఏర్పాటుపై ఎఫ్ఎస్ఎస్ఏఐతో సదరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగినా కార్యాచరణ మాత్రం తిరుమలతోనే సాధ్యమైంది.

9 నెలలకు...

కిందటేడాది జూన్ 1 నుంచి ప్రారంభమైన ల్యాబ్ ఏర్పాటు పనులు ఇటీవలే పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ల భాగస్వామ్యంతో తితిదే సహకారంతో ఈ ల్యాబరేటరీ ఏర్పాటుకు ఒడిఒడిగా అడుగులుపడ్డాయి. గతంలో చోటుచేసుకున్న కల్తీ ఘటనలు దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా తిరుమలలో ల్యాబ్ కు సుమారు రూ.25 కోట్ల వరకు వ్యయమవుతోశీది. టీటీడీ స్థలానివ్వగా.. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చింది

ఇందులో సుమారు రూ.10 కోట్లతో అత్యాధునిక పరికరాలను ల్యాబ్ లో సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ల్యాబ్ కూ ట్రాన్సఫార్మర్, జనరేటర్ సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. త్వరలో రూ.3 కోట్లతో ఫ్రాన్స్ నుంచి ఈ-నోస్, ఈ-టంగ్ యంత్రాలు రాబోతున్నాయని తెలిపారు. ఇవి వాసన, రుచి లో తేడాలను గుర్తిస్థాయన్నారు. చిన్న పెద్దా కలిపి 50 పరికరాలు/యంత్రాలు ఉన్నాయి. ఆహార పదార్థాల్లో సేకరించిన ఒక్కో నమూనాను పదుల సంఖ్యలో పరీక్షించే సామర్థ్యం ల్యాబ్ కు ఉంది. ముడి సరుకులు, ఇతర నమూనాల విషయాల్లోనూ ఇలాగే పరీక్షలు జరుగుతాయి. గరిష్టంగా ఒక నమూనా ద్వారా 50 రకాల పరీక్షలు చేయడానికి వీలుశీది.

ప్రసాదాలు, జల, ముడి సరకుల నమూనాల పరీక్షలు!

కొత్తగా ఏర్పాటైన ల్యాబ్లో ప్రసాదాలు, వాటికి వినియోగించే ముడిసరకుల్లో పురుగు మందుల అవశేషాలు, భారలోహాలు, క్రిమికీటకాలు,

వంటి వాటి గురించి నమూనాలు పరీక్షించడం ద్వారా తెలుసుకుంటారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, క్రిస్మిస్, బాదంపప్పు, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు కారం వంటి నమూనాలను ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు. జలప్రసాదాల నమూనాలను సైతం ఇక్కడ పరీక్షిస్తారు. నెయ్యి, నూనెలో ఉండాల్సిన కొవ్వుల శాతం, వెజిటబుల్ ఆయిల్, జంతువుల కొవ్వు వంటివాటిని సులువుగా గుర్తిస్తారు లడ్డూల్లో ఎనర్జీ లెవల్స్, వాడిన నెయ్యిని, ఆహారంలో బ్యాక్టీరియా ఉందా? లేదా? కూడా ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు.

ఇప్పటివరకు...

తిరుమలలో 1981లో వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబరేటరీ ఏర్పడింది. 1988లో దీనిని ఉన్నతీకరించి, ఆహార పదార్థాల నమూనాలు పరీక్షించడం ప్రారంభించారు. 2018లో దీనికి ఎనబీఎల్ అక్రిడిటేషన్ లభించింది. ఈ ల్యాబ్లో సాధారణ స్థాయిలో పరీక్షలు జరుగుతున్నాయి

# మియాపూర్‌లో వైన్ షాప్ టార్గెట్

## ఇద్దరు నిందితులు అరెస్టు



మియాపూర్,మార్చి 20:(బిఎన్ఎస్ మీడియా):మియాపూర్‌లో దొంగలు మరోసారి తమ హైటెక్ పద్ధతిని ప్రదర్శించారు. రెడ్డి కాలనీలోని జేఎస్ వైన్ మార్ట్‌ను టార్గెట్‌గా చేసుకుని రాత్రి సమయంలో పైకప్పు పగలగొట్టి లోపలికి చొరబడి నగదు అపహరించిన ఘటన కలకలం రేపింది. సుమారు రూ.85 వేల నగదు చోరీకి గురైంది.

వివరాల్లోకి వెళ్తే... షాప్‌లో పనిచేస్తున్న క్యాషియర్ మార్చి 14 రాత్రి విధులు ముగించుకుని షాప్ మూసివేసి వెళ్లాడు. అయితే మార్చి 15 ఉదయం షాప్ తెరిచి చూసే సరికి స్టోర్‌రూమ్ సమీపంలోని పైకప్పు షీట్లు పగిలి ఉండటంతో పాటు కౌంటర్లు కూడా దెబ్బతిన్నట్లు గమనించాడు. వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మద్దాల శ్రీనివాసరావు , ఆకాశ్ కుమార్ ఉన్నారు. వీరిలో ఒకరికి గతంలో కూడా చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఆశా వర్కర్ల నిరసన




నల్గొండ (బీఎన్ఎస్): ఆశా వర్కర్లకు రూ. 18,000/- ఫిక్స్డ్ వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని గడియారం సెంటర్ లో ఆశా వర్కర్ల నిరసన చేపట్టారు. స్థానిక మంత్రి కార్యాలయం ఇందిరా భవన్ ముట్టడి చేసెందుకు వచ్చిన సిఐటియు, ఆశ వర్కర్లు పోలీసులు అడ్డుకోవడం తో ఇందిరా భవన్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు.. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సలీం మాట్లాడుతూ..

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలనీ అన్నారు. ఆశాల అన్ని సమస్యల పరిష్కారానికి చీఎవీ కింద తగిన నిధులు కేటాయిస్తూ, భుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలనీ అన్నారు...అనంతరం అక్కడికి చేరుకున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందచేశారు.

# నూకాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు...!!



భీమిలి (బీఎన్ఎస్): భీమిలి లో నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఈ సంవత్సరం 2 రోజులకు రూ.12,70,682/- లు ఆదాయం వచ్చినది. ఇందులో టికెట్ల ద్వారా రూ.7,19,895/- హుండీలు ద్వారా రూ 5,50,787/- లు ఆదాయం వచ్చినది. అహర్నిశలు శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి సేవలో తరిస్తూ ఉత్సవాన్ని 4 రోజుల పాటు ఎంతో వైభవంగావిజయవంతంగా జరిపించిన ఉత్సవ కమిటీ పెద్దలకు మరియు ఉత్సవ కమిటీ సభ్యులకు, అన్ని విధాల సహకరించిన అమ్మవారి భక్తులకు ప్రతీ ఒక్కరికీ కమిటి ధన్యవాదాలు తెలియజేసారు.






# నువ్వు చంద్రుణ్ని చూడు..

జ్ఞాపకాల నీడలు ప్రతీక్షణం నిన్ను వెంటాడినప్పుడు.. నువ్వు చంద్రుణ్ని చూడు నీకు నేను కనిపిస్తానంటున్నారు హీరో సల్మాన్ ఖాన్. ఆయన.. కథానాయిక చిత్రాంగద సింగ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'మాతృభూమి'. 'మే వార్ రెస్ట్ ఇన్ పీస్' ఉపశీర్షిక. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి 'చాంద్ దేఖ్‌లేనా' అనే గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'దూరంగా వెళ్లినప్పుడు చింతించకు.. నువ్వు చంద్రుడిని చూడు.. నేను నిన్ను చూస్తాను' అంటూ సాగే ఈ పాట విధుల నుంచి భర్త రాక కోసం పరితపించే భార్య సన్నివేశాలు.. హీరోహీరోయిన్ల కెమిస్ట్రీతో ప్రేమ గీతంగా ఆకట్టుకుంటోంది.

# మేలో సూర్య చిత్రం



సూర్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'కరుప్పు' చిత్రాన్ని మే 14న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. ఆర్.జె.బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. త్రిష కథానాయిక. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మించారు. మాస్ అంశాలతో కూడిన వాణిజ్య ప్రధానమైన సినిమా అని... కథ, కథనాలు, పాత్రలోని గాఢత ప్రేక్షకులకు భావోద్వేగాల్ని పంచుతాయని సినీ వర్గాలు చెప్పాయి. ఇంద్రన్స్, నట్టి, శ్వాసిక, అనఘ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్.

# మణిరత్నం డైరెక్షన్ లో సేతుపతికి జోడిగా సాయి పల్లవి




తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్ట్స్ సినిమాను ప్రకటించాడు.

ప్రముఖ దర్శకుడు మణిరత్నం తగ్ లైఫ్ డిజాస్టర్ తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని పవర్ఫుల్ కథతో కంబ్యాక్ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తోంది. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ చిత్రాల నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అలాగే మణిరత్నం కు చెందిన మద్రాస్ టాకీస్ సంయక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల ా= ఈ ప్రాజెక్ట్‌కు నో చెప్పడంతో అదే కథకు విజయ్ సేతుపతితో చేస్తున్నారు మణిరత్నం. నేడు అఫీషియల్ గా ప్రకటించిన ఈ సినిమాను ఆస్కార్ విన్నెర్ ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

# సిద్దు జొన్నలగడ్డ -- సితార ఎంటర్టైన్మెంట్స్.. సినిమా స్టార్ట్



టాలీవుడ్‌లో తనదైన మేనరిజం మరియు టైమింగ్‌తో యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. డీజే, డీజే టిల్లు వంటి సూపర్ హిట్స్ తర్వాత జాక్, తెలుసు కదా వంటి భారీ డిజాస్టర్స్ అందుకున్నాడు సిద్దు. దాంతో ఇప్పుడు రూటు మార్చి ఒక విభిన్నమైన జోనర్‌లోకి అడుగుపెడుతున్నాడు. ఉగాది కానుకగా ఈ సినిమా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రానికి అనిల్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. గతంలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన భారీ యాక్షన్ చిత్రం 'సాహో'కు ఆయన కో-రైటర్‌గా మరియు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన అనిల్ ఇప్పుడు దర్శకుడిగా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. సిద్ధు జొన్నలగడ్డ కెరీర్‌లోనే ఇది ఒక విభిన్నమైన చిత్రమని తెలుస్తోంది. కమర్షియల్ అంశాలతో పాటు విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యత ఉన్న ఫాంటసీ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కథా నేపథ్యం మరియు మేకింగ్ పరంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్టు సమాచారం. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ఇప్పటికే వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 2026 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. సిద్ధు జొన్నలగడ్డ మార్క్ ఎనర్జీకి ఫాంటసీ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద మరో మ్యాజిక్ ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. వరుస ఫ్లోప్స్ తో ఇబ్బందిపడుతున్న సిద్దు జొన్నలగడ్డ ఈ సినిమాతో సూపర్ హిట్ కొట్టి సక్సెస్ ట్రాక్ ఎక్కుతాడేమో చూడాలి.




# ఇదిగిదిగో... ఈగో రాజా

'శంబాల' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆది సాయికుమార్ తమిళంలోకి అడుగుపెడుతున్నారు. ఆయన కథానాయకుడిగా తమిళంతోపాటు, తెలుగులోనూ ఓ చిత్రం రూపొందుతోంది. సతీష్ ముఖ్యపాత్రని పోషిస్తున్నారు. గురు శరవణన్ దర్శకుడు. ఎస్.జి.ఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై జి.సురేష్ నిర్మిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలతోపాటు ఇతర మాస్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాకి 'ఈగో రాజా' అనే పేరుని ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా గురువారం టైటిల్ పోస్టర్‌ని విడుదల చేశారు. "ఆది సాయికుమార్, గురు శరవణన్‌ల కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్మాత్మకమైన ద్విభాషా చిత్రమిది. మాస్ అంశాలతో అలరించేలా ఈ చిత్రం ఉంటుంద"ని సినీ వర్గాలు చెప్పాయి.



# వైఎస్ఎస్ సేవలు భేష్ : చిరంజీవి

హైదరాబాద్: యోగదా సత్సంగ సొసైటీ సేవలను ప్రముఖ నటుడు, పద్మ విభూషణ్ చిరంజీవి ప్రశంసించారు. శతాబ్ద కాలంగా క్రియాయోగానికి సంబంధించి వై ఎస్ ఎస్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. వైఎస్ఎస్ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానందకు చిరంజీవి హైదరాబాదులో ఓ మీడియా సంస్థ తరఫున ఉగాది పురస్కారాన్ని అందజేశారు. స్వామీజీకి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి స్మరణానంద మాట్లాడుతూ మనసుకు, శ్వాసకు సంబంధం ఉందన్నారు. శ్వాసను నియంత్రించడం ద్వారా ఆలోచనలను ప్రభావితం చేయవచ్చని, మనసును అదుపులో పెట్టుకోవచ్చన్నారు. క్రియాయోగం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఒక యోగి ఆత్మకథ రచయిత పరమహంస యోగానంద 1917లో వైఎస్ఎస్ ను స్థాపించారని ఆయన గుర్తు చేశారు. క్రియాయోగ ధ్యానానికి సంబంధించిన పాఠాలను వై ఎస్ ఎస్ నుంచి పోస్ట్ ద్వారా పొందవచ్చని స్వామీజీ సూచించారు. స్వామి స్మరణానంద ఖరగ్ పూర్ ఐఐటీ విద్యార్థిగా ఉన్నప్పుడే పరమహంస యోగానంద రచనల వైపు ఆకర్షితులయ్యారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో కలిసి పనిచేసే అవకాశం వచ్చినా ఆధ్యాత్మిక రంగంలోనే కొనసాగాలనుకుని వై ఎస్ ఎస్ లో చేరారు. 4 దశబ్దాలుగా సేవలందిస్తున్నారు. వై ఎస్ ఎస్ సంస్థ తరపున అనేక విద్య, సేవాకార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రాచీన కాలం నాటి క్రియాయోగాన్ని వై ఎస్ ఎస్ గురుపరంపర జన బాహుళ్యంలోకి తీసుకువచ్చింది. పరమహంస యోగానంద 1920 నుంచి అమెరికా, యూరప్ దేశాల్లో క్రియాయోగ వ్యాప్తికి విశేషంగా కృషి చేశారు.